క్లుప్తంగా

బీటీ రోడ్లపై భోగి మంటలు వేయకండి


జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలో సంక్రాంతి వేడుకలు నిర్వహించే వారు బీటీ రోడ్లపై భోగి మంటలు వేయరాదని శనివారం జోనల్ కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ కోరారు. 40 నుంచి 63 వార్డులకు సంబంధించిన ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జోన్ అభివృద్ధిలో భాగంగా ఇటీవల సీసీ, బీటీ రోడ్లతో వార్డులను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. భోగి మంటలు వేయడం వల్ల రోడ్లపై తారు మరిగి గుంతలమయంగా మారుతాయన్నారు. వార్డుల సుందరీకరణలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ఏర్పాటు


ఊర్వశి జంక్షన్ వద్ద మైక్ సెట్‌ను ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్

తాటిచెట్లపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి జాతీయ రహదారిలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సూచనలు తెలిపేందుకు డీ–మార్ట్ సౌజన్యంతో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం(మైక్ సెట్స్)ను ఏర్పాటు చేశారు. ఊర్వశి జంక్షన్ వద్ద ఈ సిస్టంను శనివారం ట్రాఫిక్ జోన్–2 ఏసీపీ జి.రాజీవ్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ, ట్రాఫిక్‌పై అవగాహనకు, ప్రమాదాల కట్టడికి ఈ మైక్ సెట్ ఉపయోగపడుతుందని తెలిపారు. వీటిని ఏర్పాటు చేసిన డీ–మార్ట్ యాజమాన్యాన్ని ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, స్టీల్‌ప్లాంట్ సీఐ ఉమామహేశ్వరరావు, డీ–మార్ట్ మేనేజర్ వరదరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సీతమ్మధార: సంక్రాంతి పండగకు ఊర్లు వెళ్లే వారు ఇంటికి తాళం వేసి అప్రమత్తంగా ఉండాలని ఈస్ట్ సర్కిల్ క్రైం సీఐ చక్రధర్ అన్నారు. ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ వెళ్లి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు బ్యాంకు లాకర్‌లో భద్రపరుచుకోవాలని సూచించారు. అపార్ట్‌మెంట్ల వద్ద సీసీ కెమెరాలను అమర్చాలని, నేరాల కట్టడికి, ఛేదించేందుకు అవి ఉపయోగపడతాయని చెప్పారు. మహిళలు ఒంటరిగా నిర్మానుష్య ప్రదేశాలకు వెళ్లరాదని, వాకింగ్ చేసే సమయంలో నగలు కనిపించకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. ఈస్ట్ క్రైం సీఐ నంబర్ 83310 41656, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ నంబర్ 0891–2710695కు కాల్ చేసి తెలియజేయాలని సూచించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


దుర్గాప్రసాద్ మృతదేహం

కొత్తవలస: కొత్తవలస–పెందుర్తి రైల్వే లైన్‌లో మంగళపాలెం గ్రామ సమీపంలో రైలు కింద పడి తాటిచెట్లపాలెం సమీపంలోని సంజీవయ్య కాలనీకి చెందిన పిట్టా దుర్గాప్రసాద్ (47) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కొద్ది కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్టు తెలిసింది. మంగళపాలెంలో తెలిసిన వారి ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎడీరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలను సేకరించారు. మృతదేహాన్ని విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

ఇదీ..సర్కారు వారి బడి

- ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలకు కార్పొరేట్ లుక్
- రూ.2.17 కోట్లతో ఆధునికీకరణ



ఇదేదో ప్రైవేట్ స్కూల్.. కార్పొరేట్ కార్యాలయం అనుకుంటే పొరపాటే. సాక్షాత్తు సర్కారు వారి బడి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో ప్రభుత్వ పాఠశాలలు ఏ మేరకు అభివృద్ధి చెందాయన్న దానికి అద్దం పడుతున్నాయి ఈ చిత్రాలు. 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను రూ.2.17 కోట్లతో ఆధునికంగా.. ఆకర్షణీయంగా అభివృద్ధి చేశారు. ఈ అదనపు భవనం నిర్మాణంతోపాటు పాత భవనాన్ని ఆధునికీకరించారు. కార్పొరేట్ లుక్‌తో పాఠశాల భవనాలు, తరగతి గదులు, ప్లే ఏరియా, టాయిలెట్లు, వాష్ ఏరియా ఆకట్టుకుంటున్నాయి.

– సీతంపేట


ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఆధునికంగా తరగతి గది


విద్యార్థుల బుక్స్ పెట్టుకునేందుకు ర్యాక్స్


గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆట పరికరాలు


కార్పొరేట్ లుక్‌తో టాయిలెట్లు

గోదా కల్యాణం నేడు


ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణానికి సిద్ధం చేసిన ఉత్సవ విగ్రహాలు


లలితా పీఠంలో కల్యాణ వేంకటేశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు

సీతంపేట: ధనుర్మాస వ్రత మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయాల్లో గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నారు. అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠం, శ్రీనివాసనగర్ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం గోదాదేవి రంగనాయకుల కల్యాణం అంగరంగ వైభవంగా జరపడానికి ఏర్పాట్లు చేశారు. లలితా పీఠంలో ఆదివారం ఉదయం 9 గంటలకు, ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 9.30 గంటలకు కల్యాణం నిర్వహిస్తారు. లలితా పీఠంలో సాయంత్రం 6.30 గంటలకు పుష్పార్చన జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కల్యాణంలో పాల్గొన దలచిన వారు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా తిరుమంజన సేవ

శ్రవణ నక్షత్రం, రెండో శనివారం సందర్భంగా ఉదయం లలితా పీఠంలో భూనీల సమేత కల్యాణ వేంకటేశ్వరుడికి స్నపన తిరుమంజన సేవ ఘనంగా నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య అభిషేకం, అర్చన, అలంకరణ గావించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి పూజలు చేశారు.

హంపీ పీఠాధిపతి అనుగ్రహ భాషణం

ఏయూక్యాంపస్: హంపీ పీఠాధిపతి పూజ్యశ్రీ విద్యారణ్యభారతి స్వామి కిర్లంపూడిలోని శ్రీ లలితాపీఠాన్ని సందర్శించారు. పీఠంలో భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. శనివారం సాయంత్రం లలితాపీఠాన్ని సందర్శించిన స్వామీజీకి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం విద్యారణ్య భారతి స్వామి ఆలయంలో లలితాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంక్రాంతిని పురస్కరించుకుని భక్తులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి లక్ష్మణ స్వామి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తున్న విద్యారణ్యభారతి

ముగిసిన గురు పూజోత్సవాలు

మహారాణిపేట: ఆధునిక యుగంలో రకరకాల సమస్యలతో సతమతమవుతున్న మానవాళికి పరిష్కార మార్గమొక్కటే శరణ్యమని.. అలాంటి మార్గం పరమ గురువుల బోధనల్లో లభిస్తుందని ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ బి.ఎస్.ఎన్.రాజు(కోల్‌కతా) అన్నారు. జిల్లా పరిషత్ సమీపంలోని అంకోశా ఫంక్షన్ హాలులో శనివారం జగద్గురు పీఠం నిర్వహించిన 63వ మాస్టర్ సీవీవీ గురుపూజోత్సవాల ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. శ్రీ రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, మాస్టర్ పార్వతీకుమార్ బోధనలతో తాను ప్రభావితం చెందానన్నారు. అనంతరం పార్వతీకుమార్ రాసిన మెర్రీ లైఫ్ డే అనే ఆంగ్ల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. జగద్గురు పీఠం కార్యదర్శి బి.ఆర్.కె.రాజు 'శంబళ' అనే మరో పుస్తకాన్ని ఆవిష్కరించారు. సంస్థ సలహా మండలి సభ్యుడు కె.ఎస్.ఆర్.గోపాల్ (హైదరాబాద్) 'విష్ణు సహస్రనామ' ప్రసంగాల రెండవ సంపుటిని విడుదల చేశారు. సభకు అధ్యక్షత వహించిన ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.గురు ప్రసాద్ మాట్లాడుతూ విదేశాల్లో మత సంస్థ చేపడుతున్న జ్ఞానయజ్ఞం, రామనామ యజ్ఞ కార్యక్రమాలను వివరించారు. గురు పూజలో భాగంగా పప్పు రవిశంకర్ రుద్రాభిషేకం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన కె.రవి, ఖరగ్‌పూర్‌కు చెందిన జి.వి.కృష్ణమోహన్ తమ అనుభవాలను వివరించారు. 'నావాణి' దర్శన మాసపత్రికపై సమీక్ష జరిపారు. మాస్టర్ ఇ.కె. నీరాజనంతో 63వ గురుపూజోత్సవాలు ఘనంగా ముగిశాయి. సంస్థ డైరెక్టర్ అజ్జరపు శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ ఉత్సవాల్లో జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్, జగద్గురు పీఠం వివిధ కేంద్రాల నుంచి 2 వేల మందికి పైగా సాధకులు పాల్గొన్నారు.


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న బి.ఆర్.కె రాజు, కె.ఎస్.ఆర్ గోపాల్, బి.ఎస్.ఎన్.రాజు

ఆధునికతను స్వాగతిద్దాం.. సంప్రదాయాలను కాపాడుకుందాం

సినీ నటుడు సాయికుమార్


సంక్రాంతి సంబరాల్లో సాయికుమార్, జీవీఎల్

ఏయూక్యాంపస్: ఆధునికతను స్వాగతిస్తూనే.. మన సంప్రదాయాలను కాపాడుకుందామని సినీనటుడు పూడిపెద్ది సాయికుమార్ పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న మహా సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కవులు, రచయితలు, కళాకారులను అందించిన విశాఖ నగరం సాంస్కృతిక రాయబారిగా నిలుస్తుందన్నారు. 'నా తండ్రిది విజయనగరం జిల్లా కళ్లేపల్లి అగ్రహారం. నేను శ్రీకాకుళం జిల్లా అల్లుడినే..' అని చెబుతూ ఉత్తరాంధ్రతో తనకు ఉన్న అనుబంధాన్ని వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలను భవిష్యత్ తరానికి అందించే బాధ్యతను జీవీఎల్ బృందం ఎంతో సమన్వయంతో నిర్వహించిందన్నారు.

తొలి షీల్డ్ విశాఖలోనే అందుకున్నా..

తాను నటించిన తొలి చిత్రం ఛాలెంజ్ విశాఖలో చిత్రీకరించారని.. చిరంజీవితో కలిసి ఈ చిత్రంలో నటించిన సందర్భాన్ని సాయికుమార్ గుర్తు చేసుకున్నారు. ఈ చిత్రం 100 రోజుల వేడుక విశాఖలో జరిగిందని, మొదటి షీల్డ్‌ను ఇక్కడే తీసుకున్న జ్ఞాపకాలను వివరించారు. సాయంత్రం వేళ ఉత్తరాంధ్రకు చెందిన కళాకారుల ప్రదర్శనలు, మిమిక్రీ, సంగీత విభావరి, శాస్త్రీయ నృత్యాలు ఎంతో ప్రత్యేకమన్నారు. జీవీఎల్ మాట్లాడుతూ ఘంటసాల పాట, గోంగూర పచ్చడి తెలుగు వారికి ఎంత ఇష్టమో.. సాయికుమార్ స్వరం కూడా అంతే ఇష్టమన్నారు. ఆదివారం ఉదయం 4 గంటల నుంచి ఇదే ప్రాంగణంలో భోగి మంటలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి చిన్నారులకు భోగిపళ్లు పోసే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఇక్కడ చేసిన ఏర్పాట్లు ఆకట్టుకున్నాయి. డప్పు వాయిద్యాలు, గంగిరెద్దులు, థింసా నృత్యాలు, కోలాటం, కర్రసాము, సంగీత విభావరి నగర వాసులను అలరించింది. శ్రీ రామాయణ నృత్యరూపకం, ప్రాసమణి ప్రసంగం అదరహో అనేలా సాగింది. బుల్లెట్ భాస్కర్ టీం చేసిన స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి.

జోరుగా రహదారి విస్తరణ


అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో నిర్మిస్తున్న సెంటర్ మీడియన్


హైవే వద్ద జరుగుతున్న డ్రెయిన్ పనులు

సీతంపేట: అక్కయ్యపాలెం రహదారి విస్తరణ పనులు జోరుగా జరుగుతున్నాయి. జాతీయ రహదారి నుంచి నగరంలోకి ప్రవేశించే ప్రధాన మార్గాల్లో ఒకటైన అక్కయ్యపాలెం రహదారి ఆక్రమణలతో ఇరుకుగా మారడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని అధిగమించేలా ప్రధాన రహదారుల్లో ప్రయాణం సాఫీగా జరిగేలా ప్రభుత్వం రహదారి విస్తరణ చేపట్టింది. హైవే నుంచి మహారాణి పార్లర్ వరకు 80 అడుగుల రోడ్డుగా, అక్కడి నుంచి దొండపర్తి కూడలి వరకు 60 అడుగుల రోడ్డుగా విస్తరిస్తున్నారు. సుమారు నెల రోజులుగా పనులు నిర్వహిస్తున్నారు. ఆక్రమణలు తొలగించి రోడ్డుకు ఇరువైపులా సీసీ డ్రెయిన్లు నిర్మించారు. డ్రెయిన్‌పై సిమెంట్ శ్లాబులు వేశారు. ప్రస్తుతం రోడ్ మధ్యలో సెంటర్ మీడియన్ నిర్మాణ పనులు, హైవే వద్ద డ్రెయిన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రహదారి విస్తరణతో ట్రాఫిక్ సమస్యలు తీరుతాయని స్థానికులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌లో పండగ సందడి


ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బంది వేసిన సంక్రాంతి ముగ్గులు

సీతమ్మధార: స్థానిక ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం సంక్రాంతి పండగ వాతావరణం నెలకొంది. స్టేషన్ ఆవరణలో సిబ్బంది వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. మన సంస్కృతీ సంప్రదాయాలు మరింత ఆదరణ పొందేలా సంక్రాంతి విశిష్టత చాటిచెప్పేలా రంగవల్లులు వేశారు. ఈ సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని, పండగ సంతోషంగా నిర్వహించుకోవాలని స్టేషన్ అధికారులు ఆకాంక్షించారు.

శ్రీవారి లడ్డూల విక్రయం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో (టీటీడీ) రెండో శనివారం లడ్డూ విక్రయాలు కొనసాగాయి. లడ్డూ విక్రయాల కౌంటర్ వద్ద భక్తులు బారులు దీరారు. రూ. 50 లడ్డూలు అందుబాటులో ఉండటంతో భక్తులు వాటిని కొనుగోలు చేశారు.

- శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించి టీటీడీ అర్చకులు, వేద పండితులు ఆధ్వర్యంలో పలు అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

'జయహో బీసీ' సమావేశం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు శివశంకర రజకుల కాలనీలోని సామాజిక భవనంలో శనివారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాలతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయబాబు ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో బీసీలకు తగిన గుర్తింపు ఉండేదన్నారు. పార్టీ వార్డు ప్రెసిడెంట్ భరణికాన రాజు, పలిశెట్టి అప్పన్న, ఆకిరెడ్డి జగదీష్, వాసుపల్లి రాజు, ఈతలపాక సుజాత, గొలగాని సౌజన్య, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

మూడు గంటల ఆలస్యంగా మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నంలో శనివారం సాయంత్రం 6.40 గంటలకు బయలుదేర వలసిన విశాఖపట్నం–మహబూబ్‌నగర్(12861) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా రాత్రి 9.40 గంటలకు బయలుదేరి వెళ్లింది.

సినీ సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్: మెలోడి క్రియేటర్స్, శృతిలయ, రసరాగ మాధురి, కళాంజలి సరిగమ సాంస్కృతిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన 'గుర్తుకొస్తున్నాయి' పేరిట నిర్వహించనున్న సినీ సంగీత విభావరి పోస్టర్‌ను శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న సినీ సంగీత విభావరిని కళారంగ ప్రముఖులు, విజయవంతం చేయాలని కోరారు. సీహెచ్‌వీ సత్యనారాయణ, రాజశేఖర్, వి. ప్రభాకర్, ఎంఎస్ మాధవ్ పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు

సీతంపేట: తెలుగుదనం ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్థానిక శంకరమఠం రోడ్‌లోని వీ డెంటల్ క్లినిక్‌లో శనివారం జరిగిన సంక్రాంతి వేడుకలు ఆకట్టుకున్నాయి. హరిదాసు, గంగిరెద్దు, పంగలి, కోడి పందాలు వంటి అంశాలతో ఆకట్టుకునేలా సంక్రాంతి సెట్ రూపొందించారు. ఈ సందర్భంగా మహిళలకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలో తులసి, గొబ్బి నృత్యంలో ఎ.ధనలక్ష్మి, సంప్రదాయ వస్త్రధారణలో కె.రాజేశ్వరి, ఎ.ధనలక్ష్మి, కె.తులసి, కె.రమ్య, సిహెచ్.పార్వతి, కె.మేరీ, ఎం.రోహిణిలకు బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులపై భోగిపల్లు పోసి ఆశీర్వదించారు. చిన్నాపెద్దా అంతా కలిసి సందడి చేశారు.


చిన్నారులపై భోగిపల్లు పోస్తున్న మహిళలు

కార్యక్రమంలో వీ డెంటల్ డైరెక్టర్ కె.ఎం.రమేష్, డాక్టర్ వై.శ్వేత, కె.పృథ్వీరాజ్, సిహెచ్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు

మురళీనగర్: వాకర్స్ క్లబ్ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిద్దామని మురళీనగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి పిలుపునిచ్చారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో క్లబ్ నూతన కార్యవర్గం ప్రథమ సమావేశాన్ని ఆయన అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండోసారి తనను అధ్యక్షుడిగా, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నందుకు క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వాకర్స్ క్లబ్ పెద్దలు, సభ్యుల సహకారంలో తమ కర్తవ్యాన్ని నూరు శాతం నిర్వహిస్తామన్నారు. ఇటీవల కాలంలో వాకర్స్ పార్కులో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించామని చెప్పారు. ప్రతి నెల మొదటి ఆదివారం ప్రజలకు నడక ప్రాధాన్యం తెలియజేయడానికి వాక్‌థాన్ నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం 90వ జన్మదినోత్సవాన్ని ఈ నెల 27న ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 28న మెడికల్ క్యాంప్, ఇతర జాతీయ ఉత్సవాలు, ఫిబ్రవరి 4న క్లబ్ వార్షికోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యదర్శి చెల్వరాజు క్లబ్ నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. కోశాధికారి జె.కూర్మారావు ఆర్థిక నివేదికను సభ్యులకు వివరించారు. డాక్‌యార్డ్ ప్రసాద్‌ను కో ఆప్టెడ్ డైరెక్టర్‌గా, సంయుక్త కార్యదర్శిగా చొల్లంగి ప్రసాదరావును నియమించారు. పూర్వాధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, కేజీ కృష్ణారావు, సీహెచ్ కృష్ణమూర్తి, ఎం.భాస్కరరావు, ఎలక్టెడ్ గవర్నర్ కె.ద్వారకానాథ్, జి.విజయలక్ష్మి, జాలీవాకర్ ఎన్.ప్రకాశరావు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్లా చంద్రమౌళి

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు


ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావుకు అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు.ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపిక,ప్రసాదాన్ని ఈవో శ్రీనివాసమూర్తి వారికి అందజేశారు.